క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: విద్యుత్‌లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం సరూర్‌నగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డివిజినల్ ఇంజినీర్ రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ బ్యాంక్ కాలనీ ఫీడర్ పరిధిలోని కాలనీలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, 11కేవీ పెద్దఅంబర్‌పేట, లక్ష్మారెడ్డిపాలెం, పెద్దఅంబర్‌పేట టౌన్, ఆదర్శనగర్, టీ.ఎస్.హౌసింగ్ బోర్డు, స్వాతి రెసిడెన్సీ, శ్రీనివాస కాలనీ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, 11కేవీ ఆలిండియా రేడియో ఆటోనగర్, రాఘవేంద్ర కాలనీ ఫీడర్ల పరిధిలో కాలనీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, 11కేవీ ఇందు అరణ్య, కొహెడ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని డీఈ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిరుపేదలకు ఆసరాగా సీఎంఆర్‌ఎఫ్



ఎల్‌ఓసీ పత్రాలు అందజేస్తున్న మంత్రి సబితారెడ్డి

పహాడీషరీఫ్: ఆపదలో ఉన్నవారికి సీఎంఆర్‌ఎఫ్ ఆర్థికంగా ఆసరాగా మారుతుందని మంత్రి సబితారెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాం కాలనీకి చెందిన జె.సంతోష్ అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స పొందాడు. ఆర్థిక ఇబ్బందులు ఎదురవ్వడంతో సాయం కోసం స్థానిక 18వ వార్డు కౌన్సిలర్ లక్ష్మీనారాయణ ద్వారా సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకొని మంత్రికి అర్జీ పెట్టుకున్నాడు. మంత్రి సిఫార్సు మేరకు రూ.లక్ష మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన ప్రతులను శుక్రవారం మంత్రి బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మంత్రితో పాటు కౌన్సిలర్‌కు ధన్యవాదాలు తెలిపాడు.

వజ్రోత్సవాల ముగింపులో మన నేతలు



వేడుకలకు హాజరైన నాయకులు

మహేశ్వరం: హైదరాబాద్ హెచ్ఐసీసీలో జరుగుతున్న స్వతంత్ర భారత వజ్రోత్సవాల ముగింపు కార్యక్రమానికి శుక్రవారం మహేశ్వరం ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి, కందుకూరు జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డితో పాటు జిల్లాలోని పలు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు హాజరయ్యారు. ముగింపు వేడుకలు బాగా జరిగాయని నేతలు చెప్పారు.

ఓటు నమోదుపై చైతన్యం కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి

యాచారం: 18 ఏళ్లు నిండిన యువతి, యువకులు ఓటు నమోదు చేసుకోవాలని యాచారం తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటి వెళ్లి సర్వే చేయాలని, ఆధార్ కార్డు వివరాల ప్రకారం ఓటు నమోదుపై చైతన్యం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, మండల పంచాయతీ అధికారి ఉమారాణి, వివిధ గ్రామాల బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ట్రా‘ఫికర్’

- బాలాపూర్ చౌరస్తాలో నిత్యం ట్రాఫిక్‌జాం
- యూటర్న్ వద్ద గంటలకొద్దీ నిలిచిపోతున్న వాహనాలు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు



బాలాపూర్ చౌరస్తాలో బస్సు మలుపు తీసుకోవడంతో నిలిచిన వాహనాలు

మీర్‌పేట: ఆ మలుపుల వద్ద వాహనాలు యూ టర్న్ తీసుకోవాలంటే ట్రాఫిక్ జామ్ కావాల్సిందే... మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ చౌరస్తా ప్రధాన కూడలి కావడంతో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అటు బడంగ్‌పేట, ఆదిభట్ల, మిధానీ, బాలాపూర్, ఎయిర్‌పోర్టుకు వెళ్లే ప్రధాన మార్గం కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య నివారించేందుకు బడంగ్‌పేటకు వెళ్లే రహదారిని ఇటీవల విస్తరించి అభివృద్ధి చేశారు. ఇక్కడివరకు బాగానే ఉన్నా అసలు సమస్య రహదారిపై వాహనాలు మలుపు తీసుకునే చోట ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతోంది. బావర్చీ, సూపర్ థియేటర్ వద్ద ఉన్న మలుపుల వద్ద తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సు, లారీ, ఇతర భారీ వాహనం మలుపు తీసుకోవాలంటే వెనకున్న వాహనాలన్నీ ఆగాల్సిందే. మలుపు తీసుకునే చోట రహదారి ఇరుకుగా ఉండటం, భారీ వాహనం వెళ్లేందుకు చాలా సమయం పట్టడంతో చౌరస్తా వరకు వాహనాలు నిలిచిపోవాల్సి వస్తోంది. దీనికి తోడు రహదారిపై ఉన్న విద్యాసంస్థలు, వ్యాపార సముదాయాల వాహనాలు కూడా రోడ్డుపైనే నిలుపడంతో రద్దీ వేళల్లో ప్రయాణికులు, ఎయిర్‌పోర్టుకు వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు.

పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు..

ఓ వైపు మలుపులతో మరో వైపు ఇష్టానుసారంగా వాహనాలు రాంగ్‌రూట్‌లో వెళ్తుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఏళ్లుగా ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు సమస్య పరిష్కరించడంలేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానాలు విధించే ట్రాఫిక్ పోలీసులు ఉదయం, సాయంత్రం వేళల్లో మలుపుల వద్ద ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు తీసుకుంటే బావుంటుందని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. మలుపు వద్ద రోడ్డును మరింత వెడల్పు చేస్తే కూడా సమస్యకు పరిష్కారం చూపించవచ్చని వాహనాదారులు కోరుతున్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

మంత్రి సబితారెడ్డి

కందుకూరు: బీఆర్‌ఎస్ పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మంత్రి సబితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని లేమూరుకు చెందిన కాంగ్రెస్ మండల యూత్ మాజీ అధ్యక్షుడు ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్‌తో పాటు ఆ గ్రామానికి చెందిన పలువురు శుక్రవారం స్థానిక సర్పంచ్ పరంజ్యోతి, బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. కాగా బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్, జెడ్పీటీసీ జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో లేమూరుతో పాటు దెబ్బడగూడ, బాచుపల్లి గ్రామాలకు చెందిన పలువురు పెద్దఎత్తున బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పార్టీ గెలుపే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, మాజీ సర్పంచ్‌లు కొండారెడ్డి, గణేశ్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీలు రాములు, ఇందిర దేవేందర్, సురేష్, డైరెక్టర్లు పాండు, ఆనంద్, దేవీలాల్, నాయకులు రవి, అనేగౌని అంజయ్యగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, సదానందగౌడ్, కార్తీక్, పి.ఆనంద్, నవీన్‌కుమార్, దీక్షిత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, దామోదర్‌గౌడ్, విఘ్నేశ్వర్ రెడ్డి, జైపాల్, జంగయ్య, మోహన్‌రెడ్డి, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

అందరి సహకారంతో అభివృద్ధి



అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీశైలం గౌడ్

సర్పంచ్ శ్రీశైలంగౌడ్

మహేశ్వరం: మండల పరిధిలోని అమీర్‌పేట్ గ్రామం 9వ వార్డులో రూ.5.50 లక్షల నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను శుక్రవారం సర్పంచ్ శ్రీశైలంగౌడ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో అందరి సహకారంతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. పల్లె ప్రగతిలో ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పెంటల కుమారి రాయప్ప, ఉప సర్పంచ్ నర్సింగ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దేవవరంగౌడ్, కోఆప్షన్ సభ్యుడు అశోక్, వార్డుసభ్యులు.. యాదయ్యగౌడ్, మన్సాన్‌పల్లి వెంకటేష్‌గౌడ్, రాఘవేందర్ గౌడ్, రాజు, నాయకులు మచ్చేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా భద్రతే షీటీమ్ లక్ష్యం: ఎస్‌ఐ

మీర్‌పేట: మహిళల భద్రతే షీటీమ్‌ను లక్ష్యమని మీర్‌పేట ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు. శుక్రవారం జిల్లెలగూడలోని చల్లా లింగారెడ్డి ప్రభుత్వ పాఠశాలలో మీర్‌పేట పోలీసులు వనస్థలిపురం డివిజన్ షీటీమ్‌తో కలిసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్‌ఐ సుధాకర్ మాట్లాడుతూ.. ఎప్పుడు ఎలాంటి ఆపద వచ్చినా 100కు డయల్ చేయాలని, అదే విధంగా రాచకొండ వాట్సాప్ నం.87126 62111, సైబర్ స్టాకింగ్ హెల్ప్‌లైన్ నం.87126 62662కు ఫిర్యాదు చేయాలని సూచించారు. షీటీమ్‌తో పాటు కేస్‌స్టడీస్, సైబర్‌క్రైమ్ నేరాలు, మానవ అక్రమ రవాణా, సీసీ కెమెరాలు, బాల్య వివాహాలు, బాల కార్మికులు, కమ్యూనిటీ పోలిసింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు అపరిచితుల విద్యార్థుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. తల్లిదండ్రులు విద్యార్థుల పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు.

మద్యం మత్తులో బీరుసీసాతో దాడి

ఒకరికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హర్షరాజు

మీర్‌పేట: మద్యం మత్తులో ఓ యువకుడిపై బీరుసీసాతో దాడిచేసి గాయపరిచిన సంఘటన మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ గోవిందస్వామి తెలిపిన కథనం ప్రకారం వివరాలు.. దిల్‌సుఖ్‌నగర్ పీఅండ్‌టీ కాలనీకి చెందిన బీవీ.రాజు.. కుమారుడు హర్షరాజు (25) అంబర్‌పేట ప్రాంతంలోని ఓ న్యూస్ ఛానల్ (టీ న్యూస్)లో రిపోర్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 30న నాదర్‌గుల్‌లో నివాసముండే పెద్ద నాన్న కుమారుడు (వరసకు అన్న) విశాల్ రాజు, మరి కొందరు బంధువులతో కలిసి హర్షరాజు నాదర్‌గుల్ రోడ్డులోని కనకదుర్గ బార్‌లో మద్యం సేవించాడు. రాత్రి 11 గంటల సమయంలో అన్న విశాల్ రాజుతో హర్షరాజుకు పాత గొడవల నేపథ్యంలో గొడవ జరిగింది. దీంతో విశాల్‌రాజు మద్యం మత్తులో హర్షరాజు పై బీరుసీసాలతో దాడిచేశాడు. హర్షరాజుకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే అక్కడే ఉన్న బంధువులు చికిత్స నిమిత్తం ఓవైసీ ఆస్పత్రికి తరలించారు. బాధిత యువకుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మల్‌రెడ్డి రంగారెడ్డి గెలుపునకు కృషి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

మంచాల: ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వింజమూరి రాంరెడ్డి కోరారు. శుక్రవారం మంచాలలో రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పార్టీని బలమైన శక్తిగా మారుస్తామన్నారు. గ్రామాల్లో బూత్ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. మల్‌రెడ్డి రంగారెడ్డిని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేగా గెలిపించుకోవడం కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీటీసీ సభ్యుల ఫోరం అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీ జయానందం, నాయకులు హన్మంత్‌రెడ్డి, సంజీవ, మోతిరాం నాయక్, సత్తయ్య, వాజీద్, శ్రీధర్, జంగయ్య, బ్లాక్ కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు మల్లిక, మండల అధ్యక్షురాలు శిల్ప పాల్గొన్నారు.

నేడు మండల స్థాయి కబడ్డీ పోటీలు

తలకొండపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో మండల స్థాయి ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడా పోటీలను అండర్-14, అండర్-17 విభాగాల్లో నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ సర్దార్ నాయక్, పీఈటీ రఘుమారెడ్డి తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల్లోని విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఉదయం 9.30 గంటల నుంచి పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ పోటీల్లో గెలిచిన క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

రోడ్ల అభివృద్ధికి కృషి

సర్పంచ్ కుమార్

తలకొండపల్లి: మౌలిక సదుపాయాలు, వసరులు, అండర్ డ్రైనేజీలు, అంతర్గత సీసీ రోడ్లు, మట్టి, మెటల్ రోడ్లను నిర్మించి గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని సర్పంచ్ బక్కి కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని సర్పంచ్ కుమార్, ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి చంద్రధన నుంచి నిర్ధవెల్లి మట్టి రోడ్డు మరమ్మత్తు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే నిధులతో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుధాకర్, వార్డు సభ్యులు కృష్ణవేణి, యాదగిరి, రాణి, రాజు, సునీత, శాంతమ్మ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్‌ను రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతా



కమ్యూనిటీహాల్ మొదటి అంతస్తు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: ప్రతి కాలనీలో మౌలిక వసతులు కల్పించి నియోజకవర్గాన్ని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వనస్థలిపురం డివిజన్‌లో రూ.1.20 కోట్లు, హయత్‌నగర్ డివిజన్‌లో రూ. 4 కోట్ల నిధులతో పలు కాలనీలలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్లు రాగుల వెంకటేశ్వర్ రెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డిలతో కలిసి ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గానికి 4752 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరయ్యాయని, కలెక్టరేట్‌లో తీసిన లక్కీడ్రా ద్వారా 500 మందికి ప్రతాప్ సింగారంలో ఇళ్లు కేటాయిస్తారని చెప్పారు. విడతల వారీగా అర్హులందరికీ ఇళ్లు ఇస్తామన్నారు. లక్కీడ్రాలో ఇళ్లు వచ్చిన వారు తమ తమ పత్రాలతో శనివారం ఉదయం 7 గంటలకు ఎల్‌బీనగర్ మున్సిపల్ కార్యాలయం వద్దకు వస్తే అధికారులు వారిని బస్సుల్లో ఇళ్లు కేటాయించిన ప్రాంతానికి తీసుకెళ్తారన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జిట్టా రాజశేఖర్‌రెడ్డి, సామ తిరుమల్‌రెడ్డి, నాయకులు కుంట్లూరు వెంకటేశ్‌గౌడ్, చింతల రవికుమార్, శ్రీధర్‌గౌడ్, వేములయ్యగౌడ్, సామ వెంకట్‌రెడ్డి, కేఎల్ఎన్ రావు, శ్రావణ్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ప్రాకారం పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న జితేందర్‌రెడ్డి

పహాడీషరీఫ్: మామిడిపల్లిలోని ప్రాచీనమైన శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ ఉత్తర ద్వారం ప్రాకారం పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. దాత బద్దం జితేందర్‌రెడ్డి చేతుల మీదుగా పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేశ్ వాల్మీకి, సభ్యులు కృష్ణ, పద్మ శంకర్, సహదేవ్, అశోక్, రంగనాయకుల స్వామి ఆలయ చైర్మన్ వాసుదేవారెడ్డి, రఘుమారెడ్డి, రాజుగౌడ్, పూజారి సుధీర్ తదితరులు పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకురావాలని ఆయన కోరారు.

వృక్ష విలాపం!

నాటి మహా వృక్షాలు

- నేడు మోడుబాని దర్శనం
- నిర్వహణ లేక ఎండిపోతున్న వైనం

అబ్దుల్లాపూర్‌మెట్: ‘వృక్షో రక్షతి రక్షితః’ అంటే వృక్షాన్ని మనం కాపాడితే.. అది మనల్ని రక్షిస్తుందని అర్థం. వందల ఏళ్ల నాటి మహా వృక్షాలకు జాతీయ రహదారి విస్తరణ గండంగా మారింది. విజయవాడ జాతీయ రహదారి విస్తరణలో తొలగించిన చెట్లను మరో చోటకు తరలించాలని భావించారు. ఆశయం బాగానే ఉంది. కానీ ఆచరణలో మాత్రం విఫలమయ్యారు. నిత్యం రద్దీగా ఉండే రహదారికి ఇరువైపులా నీడనిచ్చే మహావృక్షాలు రోడ్డు విస్తరణకు అడ్డుగా మారడంతో వాటిని తొలగించి మరోచోట నాటించారు. ఆ వృక్షాలను సంరక్షించేవారు లేక మొండి మొద్దులుగా దర్శనమిస్తున్నాయి. చిన్న చెట్లను కాలనీలకు వెళ్లే దారిలో పెట్టగా...పెద్ద వృక్షాలను పెద్దఅంబర్‌పేట ఔటర్ రోడ్డు నుంచి బలిజగూడకు వెళ్లే దారిలో జడ్పీ రోడ్డుకు ఇరువైపులా నాటారు. వర్షాలు కురవకపోవడంతో పాటు నిర్వహణ లేకపోవడంతో చెట్లు ఎండిపోతున్నాయి.



ఎండిపోతున్న చెట్లు

పెట్టుబడిదారుల ఆస్తులు పెంచుతున్న కేంద్రం

రైతు సంఘం నేతల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న జంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రైతు వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకోవాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగారెడ్డి, జిల్లా కార్యదర్శులు మధుసూధన్‌రెడ్డి, ప్రభులింగం డిమాండ్ చేశారు. శుక్రవారం సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు చట్టాలను వెనక్కు తీసుకుంటామని కేంద్రం లిఖితపూర్వకంగా హామీ ఇచ్చినా నేటి వరకు ఉపసంహరించుకోలేదని మండిపడ్డారు. పలు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తూ పెట్టుబడిదారుల ఆస్తులను మోదీ ప్రభుత్వం పెంచుతోందన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ సంస్థగా మారిందని ఆరోపించారు. ధరణి పేరుతో రైతులను ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. కార్పొరేట్ సంస్థలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొమ్ము కాస్తూ రైతుల హక్కులను కాలరాస్తున్నాయని వారు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రాంరెడ్డి, అంజయ్య, జగన్, జంగయ్య, వెంకటేశ్, భాషయ్య, తావునాయక్, ఐలయ్య, బిక్షపతి, అశోక్‌లు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

జెడ్పీటీసీ దశరథ్

కడ్తాల్: ఆపదలో ఉన్న నిరుపేదలకు సీఎం రిలీఫ్‌ఫండ్ వరమని జెడ్పీటీసీ ధశరథ్ నాయక్ అన్నారు. మండలంలోని గానుగుమార్లతండాకు చెందిన సభవట్ జ్యోతికి రూ.20 వేలు, అన్మాస్‌పల్లి గ్రామానికి చెందిన సంతోషకు రూ.7500లు, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరయ్యాయి. శుక్రవారం బాధిత కుటుంబాలకు ధశరథ్ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హంశ్యమోత్యానాయక్, ఉప సర్పంచ్ శారధపాండునాయక్, వార్డు సభ్యులు బీమన్, శ్రీనునాయక్, సోమ్లానాయక్, ప్రేమ్, రమేశ్ తదితరులు ఉన్నారు.

వరాలివ్వు తల్లీ!

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు



అష్టలక్ష్మి అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

దిల్‌సుఖ్‌నగర్: మూడవ శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతాన్ని మలక్‌పేట జోన్ పరిధిలో ఘనంగా జరుపుకున్నారు. ఆర్‌కేపురం అష్టలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఉదయం నుంచే అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని సంతోషిమాత, దుర్గాదేవి ఆలయాలతో పాటు, మలక్‌పేటలోని ఆండాళ్ నిలయం, మాదన్నపేటలోని దుర్గాదేవి ఆలయం, సైదాబాద్‌లోని జయదుర్గా, విజయదుర్గాదేవి ఆలయం, ఐఎస్‌సదన్ తదితర ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాలు, ఇళ్లలో మహిళలు వరలక్ష్మీ వ్రతాలను వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.



అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు